www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 24 ఏప్రిల్ 2024
8 పేజీలు

ఏలూరు
పశ్చిమ గోదావరి

ధాన్యం తరలించేదెలా..!

- లారీలు లేక రైతుల అవస్థలు
- ట్రాక్టర్లపైనే ధాన్యం తరలింపు
- జిపిఎస్ ట్రాక్ కావడం లేదంటూ రోజంతా నిరీక్షణే
- ధాన్యం తోలేందుకు ట్రాక్టర్ యజమానుల విముఖత
- నిడమర్రు మండలంలో పరిస్థితి మరింత దారుణం
- పక్కనే మిల్లులున్నా 70 కిలోమీటర్ల దూరం ధాన్యం తరలింపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం తరలించేందుకు రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి తరలించేందుకు ప్రభుత్వం లారీలు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో ట్రాక్టర్లతోనే ధాన్యం తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిల్లుల వద్ద జిపిఎస్ ఎకనాలెడ్జ్‌మెంట్ కాకపోవడంతో రోజులు తరబడి ధాన్యం తీసుకొచ్చిన ట్రాక్టర్లు ఉండిపోవాల్సి వస్తుందని యజమానులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్ యాజమానులు సైతం ముందుకు రాకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఏలూరు జిల్లాలో ధాన్యం తరలింపులో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో రెండులక్షలకుపైగా ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో 80 వేలకుపైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. రబీ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే పశ్చిమలో దాదాపు 25 శాతం మాసూలు పూర్తవ్వగా, లక్ష టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు 46 వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. దాదాపు 2.66 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటి వరకూ 70 వేల టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇంకా పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో రవాణా ఇబ్బందులు తీవ్రతరమవుతున్నాయి. ముఖ్యంగా నిడమర్రు వంటి మండలాల్లో పరిస్థితి మరింత ఘోరంగా తయారైందని రైతులు చెబుతున్నారు. ఈ మండలంలో దాదాపు ఏడు వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ మండలానికి పక్కనే ఉన్న గణపవరం మండలంలో రైసుమిల్లులు ఉన్నాయి. జిల్లా వేరు అనే కారణంలో నిడమర్రు మండలానికి సంబంధించిన ధాన్యాన్ని 70 కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్న పెదపాడు, ఏలూరు చుట్టుపక్కల ఉన్న మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారు. ఇది రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. గణపవరం మిల్లులను కేటాయిస్తే ట్రాక్టర్లపై ధాన్యం తరలించేందుకు రైతులకు వీలుగా ఉంటుంది. ధాన్యం తరలింపు సైతం వేగంగా ముందుకు నడుస్తోంది. ప్రభుత్వం నుంచి లారీల ఏర్పాటు అనేది లేకుండాపోయిందని రైతులు చెబుతున్నారు.

మిల్లుల వద్ద వాహనదారుల పడిగాపులు

ధాన్యం తరలించేందుకు రైతులే ట్రాక్టర్లుగాని, ప్రయివేటు వాహనాలుగాని ఏర్పాట్లు చేసుకోవాల్సి వస్తోంది. నానా తంటాలు పడి ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని మిల్లులకు తరలిస్తే ఇక్కడ పరిస్థితి మరోలా ఉంది. ధాన్యం మిల్లుకు వచ్చాక జిపిఎస్ ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుంది. అది పూర్తికాకుండా ధాన్యం తీసుకొచ్చిన వాహనం అక్కడ ..6లో

ఓటింగ్ శాతమే కీలకం..

ఎన్నికల్లో ఓటింగ్ శాతమే అత్యంత కీలకం. అభ్యర్థుల దిశ, దశ మార్చడంలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. అయితే గత ఎన్నికలు పరిశీలిస్తే పట్టణ ప్రాంతాల్లో తక్కువ శాతం ఓటింగ్ నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెరిగింది. జిల్లా కేంద్రాలు ఏలూరు, భీమవరం వంటి ప్రాంతాల్లో సైతం నామమాత్రంగానే ఓటింగ్ నమోదు కావడం గమనార్హం. అయితే ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని మరింత పెంచేందుకు ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇప్పటికే అనేక అవగాహనా కార్యక్రమాలు చేపట్టింది. అయితే ఇవి ఎంతవరకు ఫలితాలు ఇస్తాయనేది వేచి చూడాలి

- అభ్యర్థుల దిశ, దశ మార్చడంలో ప్రధాన పాత్ర
- గత ఎన్నికల్లో పట్టణాల్లో తక్కువగా నమోదైన ఓటింగ్
- జిల్లా కేంద్రాలు ఏలూరులో 68.39 శాతం, భీమవరంలో 78.84 శాతం ఓటింగ్ నమోదు
- అవగాహన లేకుంటే ఓటింగ్ శాతంపై తీవ్ర ప్రభావం
- ఎన్నికల సంఘం దృష్టి సారిస్తేనే సత్ఫలితాలు సాధ్యం

ప్రజాశక్తి - భీమవరం

ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల పోరు హోరాహోరీగా సాగుతోంది. బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచార కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు అధికారులు మరింత అప్రమత్తమై ముందుకు సాగుతున్నారు. అయితే వీటన్నింటికీ మూలాధారంగా ఉన్న ఓటింగ్ శాతం కీలకంగా మారింది. అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయించేది, దశ.. దిశ మార్చేది సైతం ఈ ఓటింగ్ శాతమే. అయితే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఓటుహక్కు వినియోగంలో విచిత్ర పరిస్థితి ఉంది. విద్యావంతులు, ఉద్యోగులు అధికంగా ఉండే పట్టణ ప్రాంతాల్లో 2019 ఎన్నికల్లో తక్కువశాతం ఓటింగు నమోదైంది. అటవీ ప్రాంతం, నిరక్షరాస్యత తక్కువ, సరైన రవాణా మార్గం లేని మారుమూల నియోజకవర్గం పోలవరంలో అంతకన్నా ఎక్కువ శాతం ఓటింగ్ నమోదు కావడం గమనార్హం. 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 25,31,288 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో అత్యధికంగా ఉంగుటూరు నియోజకవర్గంలో 87.31 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యల్పంగా ఏలూరు నియోజకవర్గంలో 68.39 శాతం నమోదైంది. గిరిజన నియోజకవర్గం పోలవరం 86.91 శాతం ఓటింగ్‌తో జిల్లాలో రెండో స్థానంలో ఉండటం విశేషం. ఈ పరిణామాలను బట్టి విశ్లేషిస్తే అక్షరాస్యులు కన్నా, నిరక్షరాస్యులే ఓటుహక్కును బాధ్యతగా భావిస్తున్నట్లు అర్థమవుతోంది. పశ్చిమ జిల్లా కేంద్రం భీమవరంలో 78.84 శాతం నమోదైంది. మరో పట్టణ నియోజకవర్గం నరసాపురంలోనూ, అదేశాతం నమోదుకావటం విచిత్రం. ఆ రెండు సెగ్మంట్ల కన్నా జిల్లాలోని మరో రిజర్వుడు నియోజకవర్గం చింతలపూడిలోనూ 82.56 శాతం ఓటింగ్ నమోదైంది. పట్టణ ప్రజలకన్నా గ్రామీణ ప్రాంతాల్లోనే ఓటర్లు చైతన్యంతో పోలింగ్‌లో పాల్గొన్నరనడానికి ఇదే నిదర్శనం.

పట్టణ ప్రాంతాలపై ప్రధాన కేంద్రీకరణ అవసరం

గత ఎన్నికలతో పోలిస్తే మూడు నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్నిచోట్లా తక్కువ శాతం పోలింగ్ నమోదైంది. దీని ప్రభావం ..6లో

ఐదో రోజు 59 నామినేషన్లు

- 'పశ్చిమ'లో అసెంబ్లీకి 19, పార్లమెంట్‌కు 11
- ఏలూరు జిల్లాలో అసెంబ్లీకి 26, పార్లమెంట్‌కు 3
- నామినేషన్ల సందర్భంగా ర్యాలీల హోరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరులో నామినేషన్ వేస్తున్న సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు

రెండు జిల్లాల్లో ఐదో రోజు మంగళవారం మొత్తం 59 నామినేషన్లు దాఖలయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో అసెంబ్లీ స్థానాలకు 19, పార్లమెంట్‌కు 11 నామినేషన్లు దాఖలవ్వగా, ఏలూరు జిల్లాలో అసెంబ్లీకి 26, పార్లమెంట్‌కు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 18న నామినేషన్లు ప్రారంభమవ్వగా ఆదివారం సెలవు దినం కావడంతో ఇప్పటి వరకూ ఐదు రోజులు నామినేషన్ల ప్రక్రియ సాగింది. మంగళవారం ప్రధాన పార్టీలకు సంబంధించి వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, సిపిఐ ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, ఉంగుటూరులో జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, కైకలూరులో బిజెపి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌తోపాటు పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు ఒకరికొకరు ..6లో

అన్నింటా ప్రత్యేకం.. నరసాపురం

మధ్యపేజీల్లో..

సిరా చుక్కకో లెక్కుంది..

'నామినేషన్ల'లో నిబంధనలకు నీళ్లు..!

8లో..

అంతరాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా

తెలంగాణ సరిహద్దుల జిల్లాల సమీక్షలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఎటువంటి ప్రలోభాలకూ తావులేని స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిర్వహించే క్రమంలో కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎపి, తెలంగాణ సరిహద్దుల జిల్లాల అధికారుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాలు నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఏలూరు జిల్లాల అధికారులతో అంతరాష్ట్ర సరిహద్దుల్లో అనుసరించాల్సిన నిఘా తదితర అంశాలపై ఎస్‌పి మేరీప్రశాంతితో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక, ఎస్‌పిలతోపాటు రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, ఎస్ఇబి, కమర్షియల్ ట్యాక్స్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గత గోదావరి వరదల సమయంలో ఏమేరకు సమన్వయంతో పనిచేశామో అదే స్ఫూర్తితో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పరస్పర సమాచార మార్పిడితో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిద్దామన్నారు. తద్వారా మరింత మంచి ..6లో

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని ఆరుగొలనుపేట కాలనీలో తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. తాగునీటి సమస్య పరిష్కరించండి మహాప్రభో! శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి మండల ఇఒపిఆర్‌డి పి.మురళీకృష్ణ, గ్రామ కార్యదర్శి లక్ష్మీనారాయణ స్పందించారు. ఆరుగొలనుపేట కాలనీలో పంచాయతీ బోరులో ఎండ తీవ్రతకు నీటిమట్టం తగ్గిపోవడం గమనించి మంగళవారం బోరులోకి 20 అడుగుల పైపులను దించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. కాలనీవాసులు చౌటపల్లి రాంబాబు, రంగారావు, జయరాజు, నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

చెట్ల నరికివేతపై విచారణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు - తల్లాపురం దారిలో అనుమతులు లేకుండా చెట్లు నరికి ట్రాక్టరుపై కలప తరలించుకుపోయిన వ్యవహారంలో పంచాయతీ, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. కలప అక్రమ రవాణా పేరిట సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. చేబ్రోలు పంచాయతీ పరిధికి చెందిన చెట్లను విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను ఆదివారం విద్యుత్ శాఖ సిబ్బంది ఆధర్యంలో కలప నరికే వ్యక్తి సాయంతో తొలగించారు. అనంతరం మరుసటి రోజు ఆదివారం అదే వ్యక్తి ఎలాంటి ముందుస్తు అనుమతులు లేకుండా పది చెట్లను మొదళ్లతో సహా నరికి ట్రాక్టరుపై కలప తరలించుకుపోయినట్లు తమ విచారణలో తేలిందని, అతనిపై చర్యలు తీసుకోవాలని చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చేబ్రోలు ఇన్‌ఛార్జి కార్యదర్శి జె.నాగేశ్వరరావు వెల్లడించారు. తమ విచారణలో ఏసురాజు అనే వ్యక్తి చెట్లను నరికి నట్లు ఒప్పుకున్నాడని ఇన్‌ఛార్జి విఆర్ఒ దుర్గాప్రసాద్ వివరించారు. నివేదికను తహశీల్దారు కట్టాశివయ్యకు అందించినట్లు చెప్పారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని చింతలపూడి సిఐ సుధాకర్ అన్నారు. పట్టణంలోని ఎస్‌సి హాస్టల్‌లో విద్యార్థులు రాత్రి సమయంలో దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న సిఐ రూ.30 వేలతో మెస్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నట్లు తెలిపారు.

నూజివీడులో గెలిచేది నేనే : ముద్దరబోయిన

ప్రజాశక్తి - చాట్రాయి

ఎవరెన్ని కుయుక్తులు పన్నినా నూజివీడు నియోజకవర్గంలో గెలిచేది తానేనని స్వతంత్ర అభ్యర్థి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆరుగులనుపేట, జనార్ధనవరం, జయపురం గ్రామాల్లో ఆయన సోమవారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గాన్ని ఒక స్పష్టమైన ప్రణాళికతో అభివృద్ధి చేస్తానన్నారు. రాజకీయ పార్టీల తరపున ఎంఎల్‌ఎగా ఎన్నికైతే ఆ పార్టీకి కట్టుబడి ఉండాల్సిన పరిస్థితి ఉందని, అదే స్వతంత్రంగా గెలిస్తే అభివృద్ధి నిధులను పోరాడి తెచ్చుకోవచ్చన్నారు. చాట్రాయి మండలంలో పలు సమస్యల పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు.

బి.ముసునూరు : గ్రామీణ మండలాలపై గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్య వైఖరిని అవలంభించాయని, ఫలితంగా మండల కేంద్రాల్లో సైతం కనీస మౌలిక వసతుల కల్పన నేటికీ పూర్తి కాలేదని స్వతంత్ర అభ్యర్థి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పార్టీలు అచ్చి రాలేదని 2004లో గన్నవరంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి గన్నవరాన్ని అభివద్ధి బాట పట్టించానన్నారు. అదేవిధంగా 2024లోను చరిత్ర పునరావృతం చేసి నూజివీడు ఎంఎల్‌ఎగా నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో పాటు రహదారుల విస్తరణ, పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తానన్నారు.

పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

డిఎంహెచ్ఒ శర్మిష్ఠ

ప్రజాశక్తి - భీమడోలు

పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది వేసవిని దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ, అసంక్రమిత వ్యాధులు, ఇతర సీజనల్ వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలను అందించడంలో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులను నిల్వ ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి శర్మిష్ఠ కోరారు. గుండుగొలను పిహెచ్‌సి పరిధిలోని పొలసానిపల్లిలోని సచివాలయ ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్షా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడారు. గర్భిణులకు అందించాలని ప్రత్యేక చికిత్సల గురించి వైద్యులతో చర్చించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన

ఆరోగ్య సురక్షా శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ శర్మిష్ఠ

కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల వారు ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్ ు పరిశీలించారు. శిబిరంలో 395 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని గుండుగొలను పాథమిక ఆరోగ్య డాక్టర్ కె.శ్రీలక్ష్మి తెలిపారు. ఇద్దరిని మెరుగైన ఉన్నత స్థాయి వైద్యం కోసం సిఫార్సు చేసినట్లు తెలిపారు.

పోలవరంలో 4 ఆర్‌బికెలు ప్రారంభం

మండల వ్యవసాయాధికారి రాంబాబు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో రైతు భరోసా కేంద్రాల్లో రైతులు అమ్మకాలు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 2024-25 సీజన్లకు సంబంధించి నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలవరం, పాత పట్టిసీమ, గూటాల, కొత్తపట్టిసీమ రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ళ ప్రారంభించినట్లు తెలిపారు. గ్రేడ్ ఎ రకం క్వింటాకు రూ.2,203, సాధారణ రకం రూ.2,183 ధరగా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, వరికోతల అనంతరం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విధిగా పేరు నమోదు చేసుకోవాలని, రవాణాకు లారీలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

విద్యలో రాణిస్తేనే ఉన్నత శిఖరాలు

మండవల్లి : విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సుధామ ఫౌండేషన్ అధినేత, ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది ఫలితాల్లో 578 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలిచిన మరడాని సాయిశ్రీని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గ్రంథాలయం వద్ద మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుధామ ఫౌండేషన్, ఐక్యవేదిక సంయుక్తంగా చేపట్టిన వ్యాసరచన, చిత్రలేఖన, డిబేట్, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి పలు కార్యక్రమంలో సాయిశ్రీ చురుగ్గా పాల్గొని మంచి ప్రతిభను చూపిందన్నారు. ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందించారు. కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గోర్ల హేమశ్రీ 575 మార్కులతో మండల ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలకను ఎపిఎం జి.రాజశ్రీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవే దిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు, మండలాధ్యక్షులు టి.అప్పారావు, గ్రంథాలయ అధికారిని షేక్ పరివీణ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ప్రజాశక్తి - కామవరపుకోట

పది ఫలితాల్లో తడికలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మరీదు గాయత్రీదేవి 541, దానాని మౌనిక 530, గంగుల యామిని 525, గంగుల లోకేష్ 508 మార్కులు సాధించారన్నారు. వీరిని కామవరపుకోట జెడ్‌పిటిసి సభ్యులు కడిమి రమేష్, తడికలపూడి సర్పంచి కొత్తపల్లి రజిని శ్రీనివాస్ అభినందించారు.

రానున్న ఎన్నికల్లో ఇండియా వేదికదే విజయం

కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి సృజన

ప్రజాశక్తి - టి.నరసాపురం

రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక విజయం ఖాయమని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పోలవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి దువ్వెల సృజన అన్నారు. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాధనాల నరసింహారావు ఇంటి వద్ద ఇండియా వేదిక నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సృజన మాట్లాడుతూ ఎంఎల్‌ఎగా తెల్లం బాలరాజు పోలవరం నియోజకవర్గానికి చేసిందేమి లేదన్నారు. పోలవరం నిర్వాసితుల కాలనీల్లో కనీస మౌళిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. పోలవరం నియోజక వర్గంలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని, గ్రామస్థాయిలో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి రాజ్యలక్ష్మికి, జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజుకు ఓటమి తప్పదన్నారు. ప్రజలు ఇండియా వేదికనే కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి సాకా గంగరాజు, నాయకులు ఎల్లిన వెంకటరత్నం, మడకం సుధారాణి పాల్గొన్నారు.

ఇండియా వేదికతోనే దేశ భవిష్యత్తు

కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి నోబుల్

ప్రజాశక్తి - కలిదిండి

ఇండియా వేదిక అధికారంలోకొస్తేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ అన్నారు. మండలంలోని మద్వానిగూడెంలో ఆయన మంగళవారం విజయీభవ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ప్రతి విషయంలోనూ అండగా ఉంటానని, హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ

ప్రచారంలో నోబుల్

కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ పుస్తక దినోత్సవం సందర్భంగా మహాత్మ జ్యోతి రావు పూలే ది భారత్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులచే పుస్తక ప్రతిజ్ఞను ఏలూరు జిల్లా స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు.

మాజీ సర్పంచి వీరప్రసాదరావు మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రసాదరావు (ఫైల్)

మండలంలోని సంకర్షణపురం గ్రామ మాజీ సర్పంచి సంకుల వీరప్రసాదరావు(75) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. వీరప్రసాదరావు గ్రామ సర్పంచిగా రెండు పర్యాయాలు పని చేశారు. మొదటిసారి సర్పంచి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందగా, రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరప్రసాదరావు మృతి వార్త తెలుసుకున్న ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వైసిపి నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరప్రసాదరావుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అంజలి ఘటించిన వారిలో పార్టీ మండలాధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, సొసైటీ ఛైర్మన్ ముత్యాల రాంబాబు, ఎంపిటిసి సభ్యులు వీరమళ్ల కొండలరావు, గంటా కోటేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాభక్షు, సాక్షి సాయిబాబు, బొర్రా రాంబాబు, సంకుల రామ్మోహన్‌రావు, రంగిశెట్టి కొండా పాల్గొన్నారు.

వైసిపి ఎంపీ, ఎంఎల్‌ఎ అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి కంభం విజయరాజు పట్టణంలో 16వ వార్డులో మంగళవారం వైసిపి జంగారెడ్డిగూడెం ఆ ఆర్డినేటర్ చిటికెల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి తులసి రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, పోలవరం పరిశీలకులు జెట్టి గురునాధరావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పల్నాటి బాబ్జి పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని యర్రంపల్లి గ్రామంలో వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి కంభం విజయరాజు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమటి నీరజ సుధాకర్, ఎంపిపి రాంబాబు పాల్గొన్నారు.

నేడు తెల్లం రాజ్యలక్ష్మి నామినేషన్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వైసిపి పోలవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి 24వ తేదీ బుధవారం నామినేషన్ వేయనున్నారని ఆ పార్టీ కొయ్యలగూడెం మండలాధ్యక్షులు గొడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏడు మండలాల్లోని వైసిపి శ్రేణులందరూ ఇంచుమించుగా 15 వేల మంది తరలిరానున్నారని, వారందరికీ ఏ విధమైన ఇబ్బందుల్లేకుండా వేసవిని దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు, తాగునీరు, మజ్జిగ, భోజన సదుపాయాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో వీడ్కోలు సభ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని సగంచెరువు ఎన్ఆర్ పేట ఎంపిపి స్కూలులో ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ప్రజాశక్తి విలేకరి గుడాల బాలాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి చిట్టూరి నాగేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొదటి, రెండు, మూడు బహుమతులను మెరిట్ విద్యార్థులకు పంపించారని తెలిపారు. పిల్లలకు ప్రత్యేకమైన మధ్యాహ్న విందును ఏర్పాటు చేశారు.

16వ వార్డులో జనసేన ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలోని 16వ వార్డులో జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల వల్ల బాబ్జి, ఈతకోట తాతాజీలతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి అధికారంలోకొస్తే టిడిపి కూటమి ప్రజలకు ఏం చేస్తుందో వివరించారు.

కుక్కునూరులో చిర్రి బాలరాజు పర్యటన

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు మండలంలో జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి చిర్రి బాలరాజు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అర్వపల్లి, నెమలిపేట, దాచారం, బెస్తగూడెం, కివ్వాక గ్రామాల్లోని టిడిపి, జనసేన ముఖ్య నాయకులను కలిసి మద్దతు కోరారు. ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

'టిడిపి కూటమి గెలుపునకు కృషి'

ప్రజాశక్తి - పెనుమంత్ర

అధికారంలోకొచ్చినప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులను, పెన్షనర్స్‌ను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పెడుతున్న వైసిపి ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో ఓడించాలని ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు పి.సుబ్బరాయన్ అన్నారు. మార్టేరు రోటరీ భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఎన్నికల్లో టిడిపి కూటమికి మద్దతు ప్రకటించామన్నారు.

ముదునూరి కుమారుడు, సతీమణి ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని యర్రంశెట్టివారి పాలెంలో వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు తనయుడు శ్రీకృష్ణంరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరసాపురం టౌన్ 30వ వార్డులో ప్రసాదరాజు సతీమణి శారదవాణి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణానికి చెందిన జనసేన, టిడిపి నాయకులు మంగళవారం సాయంత్రం విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో వైసిపిలోకి చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీలోకి ఆహ్వానిస్తూ ఆయన కండువాలు కప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. మరిన్ని అభివృద్ధి పనులు చేయడానికి తనను గెలిపించాలని ఆయన కోరారు. చిన ఆమిరం, అప్పారావు తోట, నరసయ్య అగ్రహారం నుంచి సుమారు 50 మంది క్షత్రియులు ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసిపిలో చేరారు. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన ముస్లిం సోదరులు ఆ వార్డు మాజీ కౌన్సిలర్ కోడె యుగంధర్ ఆధ్వర్యంలో గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసిపిలో చేరారు.

దేశంలో పెరిగిన నిరుద్యోగ సమస్య

ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్

మాట్లాడుతున్న ఐవి, ప్రభాకర్

ప్రజాశక్తి - నరసాపురం

దేశంలో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిపోయిందని ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో సంక్షోభంలో భారత్-ఆర్థిక, రాజకీయ మూలాలు అంశంపై ఆలిండియా లాయర్స్ యూనియన్ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షుడిగా దిగుపాటి రాజగోపాల్ వహించారు. ప్రధాన వ్యక్తగా పరకాల ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. దేశంలో చదువుకుని ఉద్యోగాలు లేని యువకులు 63 శాతం ఉన్నారన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ ముఖ్య సలహాదారుడు అనంత నాగేశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగాలకు కేంద్రానికి సంబంధం లేదని, పాతకాలంనాటి తుగ్లక్ సినిమా గుర్తు చేశారన్నారు. ప్రపంచ ఆకలి సూచికలో భారత్ పై స్థానంలో ఉందన్నారు. ముఖ్య అతిథి ఉభయ గోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు దిగుపాటి రాజగోపాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పూరిళ్ల శ్రీనివాస్, ముచ్చర్ల త్రిమూర్తులు, కవురు పెద్దిరాజు, చల్లా దానయ్యనాయుడు, చదలవాడ జ్ఞానప్రకాష్, పోలిశెట్టి రఘురామ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన సత్యనారాయణ

ఎంఇఒ రంగయ్య



సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఉపాధ్యాయ వృత్తిలో 41 ఏళ్ల పాటు నిర్విఘ్నంగా పనిచేసి, ఏలూరు మండలంలోనే 36 ఏళ్ల పాటు ఎలాంటి మచ్చ లేకుండా, అజాత శత్రువులా పనిచేయడం ఎస్.సత్యనారాయణ(ఎస్ఎస్ఎన్) మాస్టారుకే చెల్లిందని ఏలూరు ఎంఇఒ-2 రంగయ్య ప్రశంసించారు. మండలంలోని జాలిపూడి యుపి పాఠశాల ప్రధానోపాధాయునిగా పని చేస్తున్న ఎస్ఎస్ఎన్ ఉద్యోగ విరమణ సభ పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంగయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే, ఆయా పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు సత్యనారాయణ బాటలు వేశారన్నారు. పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు పువ్వుల ఆంజనేయులు మాట్లాడుతూ సత్యనారాయణ సేవలను కొనియాడారు. ఈ నెల 30వ తేదీతో ఉద్యోగ విరమణ చేయబోతున్న ప్రధానోపాధ్యా యులు, పిఆర్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారా యణతో పాటు ఆయన సతీమణి సీతామహాలక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్‌పర్సన్ ఎస్.వెంకటలక్ష్మి, ఎన్.సునంద, సిఆర్‌పి.సునీత, పాఠశాల తదుపరి హెచ్‌ఎం.బ్రహ్మాజీ, వి.ప్రసన్నకుమార్, ఎస్.శిరీష, కె.అనంతలక్ష్మి, జి.విజయశ్రీ, ఎం.శేషుకుమార్, డి.గణేష్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రశంసలు

పెనుమంత్ర :నెగ్గిపూడి(మార్టేరు)లోని మహాత్మా జ్యోతిరావుపూలే బిసి బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ ఏడాది పది ఫలితాల్లో 96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ ఎం.పద్మ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. పాఠశాల నుంచి 25 మంది విద్యార్థులు హాజరుకాగా 24 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. సానబోయిన హర్షవర్ధన్ 560, చెల్లింకల ఉదయ్ కిరణ్ 526, మేడపాటి హరినాథ్ 506 మొదటి మూడు స్థానాల్లో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది కలిసి విద్యార్థులకు రూ.మూడు వేల నగదు బహుమతి అందించారు.

ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ విద్యార్థుల సత్తా

నాగ్‌రెడ్డి హర్షిణి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పది ఫలితాల్లో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని స్కూల్ డైరెక్టర్ మద్దాల వాసు తెలిపారు. కర్రి హరిహర నాగ్ రెడ్డి 588, అనిశెట్టి తేజ హర్షిని 581 మార్కులతో పాఠశాల టాపర్స్‌గా నిలిచారన్నారు. 38 మంది 500లకు పైగా మార్కులు సాధించారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆంగ్లభాషా దినోత్సవం

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ప్రఖ్యాత రచయిత విలియం షేక్స్పియర్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ ఆంగ్లభాషా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. షేక్స్పియర్ చిత్ర పటానికి కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో అన్ని రంగాల్లో రాణించడానికి ఆంగ్లభాష ప్రావీణ్యం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, వి.శ్రీనివాస్, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'టిడిపితో ప్రతి కుటుంబానికీ లబ్ధి'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

టిడిపి ప్రభుత్వం అధికారంలోకొస్తే ప్రతి మహిళకు సంవత్సరానికి మూడు గ్యాస్ బండలు, నెలకు రూ.1500, ఆర్‌టిసి ఉచిత ప్రయాణం వంటి అనేక పథకాలను మహిళల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టి అమలు చేయనుందని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘాలాదేవి అన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం ఎస్‌సి కాలనీలో, పరింపూడిలో, మహిళలతో మంగళవారం సమావేశం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను మహిళలకు వివరించారు. ఈ సందర్భం గా మేఘాలాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి అధికారం లోకొస్తే ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు డి.దుర్గాదేవి, నల్లపర్తి ఝాన్సీరాణి, కొత్త రమ, మహిళలు పాల్గొన్నారు.

వైఎన్ కళాశాలకు నన్నయ విశ్వవిద్యాలయం ప్రశంస

నరసాపురం :స్థానిక వైఎన్ కళాశాలలో ఇటీవల కాలంలో నాక్ 'ఎ ప్లస్' గ్రేడ్ సాధించినందుకు రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం స్థాపించి 18 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ సత్యనారాయణరావుకు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌వి ఎస్.సాయిబాబాకు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.పద్మరాజు ప్రశంసాపత్రాన్ని అందించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.పద్మరాజు మాట్లాడారు.

నేరాలు - ఘోరాలు

గురజలో మరో గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజ శివాలయం రోడ్డులో మంగళవారం మరో గడ్డివామి దగ్ధమైంది. సోమవారం గ్రామానికి చెందిన పి.కిరణ్మయికి చెందిన మూడు గడ్డివాములు దగ్ధం కాగా, మంగళవారం సిహెచ్.సత్యనారాయణరావుకు చెందిన నాలుగు ఎకరాల మరొక గడ్డివామి దగ్ధమైంది. కైకలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.30 వేల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్ తెలిపారు. ఈ ప్రమాదానికి కారణం తెలియరాలేదని చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ చోరీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీకి గురైన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన దాకారపు సూరిబాబు, తోట వీరాస్వామినాయుడుకు చెందిన వ్యవసాయ భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి రాగి తీగలు ఆపహరించుకుపోయినట్లు బాధిత రైతులు తెలిపారు.

ఎపిగుంటలో లారీ దగ్ధం

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యుత్ ప్రమాదంలో లారీ దగ్ధమైన సంఘటన మండలంలోని ఎపిగుంట సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఎపిగుంట శివారు నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు మట్టి తరలిస్తున్న లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో అది విద్యుత్ తీగలకు తాకి మంటలు చెలరేగాయి. డ్రైవర్ లారీ నుంచి కిందకు దూకడంతో ప్రాణ హాని తప్పింది. మంటల్లో లారీ పూర్తిగా దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు.

నేడు గుడాల గోపీ నామినేషన్

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 24వ తేదీ బుధవారం వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థిగా తాను నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నట్లు గుడాల గోపీ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు పూలపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరుతున్నట్లు చెప్పారు.

ఉమాబాలను కలిసిన నన్నేటి పుష్పరాజ్

ప్రజాశక్తి - భీమవరం

వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పరాజు ఉమాబాలతో పలు సమస్యలపై చర్చించారు. వైసిపి పూర్తి మద్దతు ప్రకటించాలని ఆమె కోరారు.

'వైసిపిది అరాచక పాలన'

ప్రజాశక్తి - పెనుమంత్ర

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు గుంటూరుకు చెందిన ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి లక్ష్మి తన వేలిని కోసుకున్న సంఘటన బాధాకరమని నరసాపురం పార్లమెంటరీ దేవాంగ సాధికారిక సమితి కన్వీనర్ రొబ్బి భాస్కరరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారు ఉన్న ప్రాంతంలోని అక్రమాల గురించి ఆమె ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి ఉంటే నేడు ఇంత దారుణం జరిగి ఉండేది కాదన్నారు.

పాస్‌పోర్టు పోయినది

GEDDAM DAVID RAJU అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.30-07-2007న G2919480 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.15-04-2024న మా ఇంటి నుండి పాలకొల్లు టౌన్, మెయిన్‌రోడ్‌కు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

GEDDAM DAVID RAJU
D.No. 24A-3-46\, Ward 11,
Ramaaiah Hall, Palakollu-534260
W.G.Dt. A.P.

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా చంటి నామినేషన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

టిడిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థిగా బడేటి రాధాకృష్ణ (చంటి) మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు తహశీల్దార్ కార్యాలయంలో ఏలూరు రిటర్నింగ్ అధికారి ముక్కంటికి నామినేషన్ పత్రాన్ని అందజేశారు. అంతకుముందు ఏలూరులోని ఫైర్ స్టేషన్ నుంచి పార్టీ కార్యకర్తలు అభిమానులతో భారీ ర్యాలీగా తరలివచ్చారు. అభిమానుల కోలాహలం మధ్య బడేటి రాధాకృష్ణ ర్యాలీ సాగింది. నామినేషన్ వేసిన అనంతరం చంటి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు పడిన ఇబ్బందులకు స్వస్తి పలికే విధంగా ఈరోజు ప్రజలందరూ స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, మాజీ ఈడా ఛైర్మన్ బలరాం, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న బడేటి చంటి

వైసిపి నూజివీడు అభ్యర్థిగా ప్రతాప్ అప్పారావు

నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రతాప్ అప్పారావు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

వైసిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం నామినేషన్ వేశారు. చిన్న గాంధీ బొమ్మ సెంటర్, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్, శ్రీనివాస సెంటర్ మీదుగా నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ప్రతాప్ అప్పారావు ఆర్‌డిఒ భవాని శంకర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, వైసిపి అభ్యర్థులు అన్ని నియోజకవర్గాల్లో విజయం సాధిస్తారని అన్నారు.

తండ్రి కోసం పిల్లల ప్రచారం..

ప్రజాశక్తి - ఉండి

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత ఉండి మాజీ శాసనసభ్యులు, తన తండ్రి వేటుకూరి వెంకట శివరామరాజుకే దక్కుతుందని ఆయన బిడ్డలు శృతి, శ్రావ్య, అభిరామ్ తెలిపారు. మంగళవారం ఉండి మండలం కలిగొట్ల, పాందువ్వ గ్రామాల్లో తన తండ్రి విజయం కోసం ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఆక్వారంగాన్ని అభివృద్ధి చేసి జాతీయ స్థాయిలో ఉండి నియోజకవర్గాన్ని నిలిపారన్నారు. ప్రతి సంవత్సరమూ మహిళా దినోత్సవం, సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తూ మహిళలను ప్రోత్సహించే వారన్నారు. టిడిపి అధిష్టానం తన తండ్రికి అసెంబ్లీ సీటు కేటాయించకుండా మొండిచేయి చూపించి సిట్టింగ్ స్థానాలను తిరిగి వారికే కేటాయించామని చెప్పిన చంద్రబాబు నాయుడు ఏ విధంగా రఘు రామకృష్ణంరాజుకు కేటాయించారని అన్నారు. ప్రతి ఒక్కరూ తన తండ్రి విజయానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షురాలు వత్సవాయి సుజాత, వేగేశ్న అనంతలక్ష్మి, బురిడీ రవిబాబు, మోపిదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న వాసుబాబు

వైసిపి ఉంగుటూరు అభ్యర్థిగా వాసుబాబు నామినేషన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

వైసిపి ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన భార్య పుప్పాల ఆదివల్లి రమణి వైసిపి తరపున నామినేషన్ వేశారని ఆర్‌ఒ, ఏలూరు ఆర్‌డిఒ ఎస్‌కెఎన్ ఖాజావలీ తెలిపారు. ఇండియన్ లేబర్ పార్టీ తరపున కనికెళ్ళి మురళీకృష్ణ, బిజెపి తరపున బుంగా ఏసు, స్వతంత్ర అభ్యర్థిగా నాగం రాంబాబు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 25న భారీ ర్యాలీతో మరోసారి నామినేషన్ వేయనున్నామని వాసుబాబు తెలిపారు.

ఎన్‌డిఎ అభ్యర్థిగా కామినేని నామినేషన్

ప్రజాశక్తి - కైకలూరు

ఎన్‌డిఎ కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. వరహాపట్నంలోని ఆయన నివాసం నుంచి బిజెపి, టిడిపి, జనసేన పార్టీలకు చెందిన భారీ జన సమీకరణతో ఆయన తహశీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల అధికారి కె.భాస్కర్‌కు నాలుగు సెట్ల నామ పత్రాలను అందజేశారు. ఆయన వెంట కేంద్రమంత్రి మురుగన్, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్ రావు, నర్సిపల్లి అప్పారావు ఉన్నారు.

తణుకు స్వతంత్ర అభ్యర్థి మోహన్ నామినేషన్

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా ఇరగవరంకు చెందిన మామిడిశెట్టి మోహన్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి బివి.రమణకు అందజేశారు. తణుకు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం ఉండ్రాజవరానికి చెందిన కోడూరి మెహర్ చైతన్య ఒక సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు.

పోలవరం స్వతంత్ర అభ్యర్థిగా సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం నియోజకవర్గంలో ఐటిడిఎ కెఆర్.పురం వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. బుట్టాయగూడెం మండలం మెట్టగూడెం గ్రామానికి చెందిన స్వతంత్ర అభ్యర్థి మొడియం సూర్యచంద్రరావు మంగవారం నామినేషన్ దాఖలు చేశారు. బుట్టాయగూడెం మండలం కోయఅంకంపాలెం గ్రామానికి చెందిన కాకా కృష్ణ, జీలుగుమిల్లి మండలం దిబ్బగూడెం గ్రామానికి చెందిన ఉయకే మంగమ్మ, జీలుగుమిల్లి మండలం వంకావారి గూడెం గ్రామానికి చెందిన మడకం వెంకటేశ్వరరావు నామ పత్రాలను పోలవరం రిటర్నింగ్ ఆఫీసర్, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజకు అందజేశారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న సూర్యచంద్రరావు


నామినేషన్ దాఖలు చేస్తున్న ధర్మారాజు

జనసేన ఉంగుటూరు అభ్యర్థి ధర్మరాజు నామినేషన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా పత్సమట్ల ధర్మరాజు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్ కె.ఖాజావలీకి నామినేషన్ పత్రాన్ని అందజేశారు. ఆయన వెంట గన్ని వీరాంజనేయులు, శరణాల మాలతీ రాణి, వట్టి పవన్ కుమార్ ఉన్నారు.

అన్నింటా ప్రత్యేకం.. నరసాపురం



నరసాపురం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో తీర, డెల్టా ప్రాంతం విస్తరించి ఉంది. ఇక్కడ వరితోపాటు ఆక్వా సాగు పెద్దఎత్తున ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రాజకీయాలకు కేంద్ర బిందువైన భీమవరమే ఈ నియోజకవర్గంలోని ప్రధాన పట్టణం, నూతన పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం. ఈ నియోజకవర్గంలో ఆది నుంచి కమ్యూనిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. 1957లో జరిగిన తొలి ఎన్నికల్లోనే కమ్యూనిస్టు పార్టీ నేత ఉద్దరాజు రామం ఈ స్థానం నుంచి ఎన్నికయ్యారు. తర్వాత కాలంలోనూ కాంగ్రెస్ అభ్యర్థులకు కమ్యూనిస్టు అభ్యర్థులు ధీటైన పోటీనిచ్చారు. 1991లో అప్పటి పివి.నరసింహారావు ప్రభుత్వం సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు దాన్ని రక్షించేందుకు ఇదే నియోజకవర్గం నుంచి టిడిపి ఎంపీగా ఉన్న భూపతిరాజు విజయకుమార్‌రాజు టిడిపి పార్లమెంటరీ పార్టీలో చీలిక తీసుకొచ్చి కాంగ్రెస్ పక్షాన చేరడం పెద్ద సంచలనం సృష్టించింది. ఇక్కడ నుంచి ఎంపీగా ఎన్నికైన సినీ నటుడు యువి.కృష్ణంరాజు ఎన్‌డిఎ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పని చేశారు. ఈ నియోజకవర్గ పరిధిలోని ఆంధ్రా సుగర్స్‌తోపాటు డెల్టా పేపర్‌మిల్లు మూతపడటం వేలాది మంది కార్మికులను రోడ్డున పడేసింది. ఆక్వా చెరువుల కాలుష్యం డెల్టా వాసులను ప్రమాదకర కేన్సర్ బారినపడేటట్లు చేస్తోందనే ఆరోపణలున్నాయి. కేంద్రీయ విద్యాసంస్థ నిట్ ఈ నియోజకవర్గంలోనే ఉండగా ప్రముఖ విద్యాకేంద్రంగా భీమవరం విరాజిల్లుతున్న సంగతి తెలిసిందే.



సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1957	ఉద్దరాజు రామం	సిపిఐ	ఎం.బాపినీడు	కాంగ్రెస్
1962	డి.బలరామరాజు	కాంగ్రెస్	ఉద్దరాజు రామం	సిపిఐ
1967	డి.బలరామరాజు	కాంగ్రెస్	ఉద్దరాజు రామం	సిపిఎం
1971	ఎంటి.రాజు	కాంగ్రెస్	ఉద్దరాజు రామం	సిపిఎం
1977	ఎ.సుభాష్‌చంద్రబోస్	కాంగ్రెస్	ఉద్దరాజు రామం	సిపిఎం
1980	ఎ.సుభాష్‌చంద్రబోస్	కాంగ్రెస్(ఐ)	ఉద్దరాజు రామం	సిపిఎం
1984	బిహెచ్.విజయకుమార్‌రాజు	టిడిపి	ఎ.సుభాష్‌చంద్రబోస్	కాంగ్రెస్
1989	బిహెచ్.విజయకుమార్‌రాజు	టిడిపి	నాచు శేషగిరిరావు	కాంగ్రెస్
1991	బిహెచ్.విజయకుమార్‌రాజు	టిడిపి	యువి.కృష్ణంరాజు	కాంగ్రెస్
1996	కొత్తపల్లి సుబ్బారాయుడు	టిడిపి	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్
1998	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్	కొత్తపల్లి సుబ్బారాయుడు	టిడిపి
1999	ఉప్పలపాటి వెంకటకృష్ణంరాజు	బిజెపి	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్
2004	సిహెచ్‌వి.హరిరామజోగయ్య	కాంగ్రెస్	ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు	బిజెపి
2009	కనుమూరి బాపిరాజు	కాంగ్రెస్	తోట సీతారామలక్ష్మి	టిడిపి
2014	గోకరాజు రంగరాజు	బిజెపి	వంకా రవీంద్రనాద్	వైసిపి
2019	కె.రఘురామకృష్ణంరాజు	వైసిపి	వి.శివరామరాజు	టిడిపి

ఐదో రోజు ఐదు నామినేషన్లు : ఆర్‌ఒ ప్రవీణ్ ఆదిత్య

నామినేషన్ దాఖలు చేస్తున్న శివ

ప్రజాశక్తి - ఉండి

ఐదో రోజు మంగళవారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య అన్నారు. మంగళవారం వైసిపి అభ్యర్థిగా యండగండి గ్రామానికి చెందిన పివిఎల్ నరసింహారాజు 2 సెట్ల నామినేషన్ పత్రాలు, కాంగ్రెస్ అభ్యర్థిగా కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామానికి చెందిన వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు ఒక సెట్టు, కాంగ్రెస్ అభ్యర్థిగా కాళ్లకూరు గ్రామానికి చెందిన వేగేశ్న వెంకట రామరాజు ఒక సెట్, ఉండి అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా కాళ్ల మండలం కలవపూడి గ్రామానికి చెందిన వేటుకూరి వెంకట శివరామ రాజు ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు, సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం నామినేషన్ పత్రాలను స్వీకరించినట్లు ప్రవీణ్ ఆదిత్య తెలిపారు.

తాడేపల్లిగూడెం: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఐదో రోజు మంగళవారం నలుగురు అభ్యర్థులు ఒక్కో సెట్టు చొప్పున నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య తెలిపారు. బహుజన సమాజ పార్టీ అభ్యర్థిగా తాడేపల్లిగూడెంకు చెందిన కొత్తపల్లి.వెంకటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థిగా పెంటపాడు మండలం పత్తిపాడు గ్రామానికి చెందిన సిరివరపు సింహాచలం నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామానికి చెందిన పెద్ద మూర్తి రాజేంద్ర ఒక సెట్టు నామినేషన్ పత్రం, పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా వీరవాసరం మండలం అండలూరు గ్రామానికి చెందిన మేక వెంకటేశ్వరరావు ఒక సెట్టు నామినేషన్ పత్రం దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఈఒ బి.మురళీకృష్ణ, ఎఒ ఎల్.నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న గోపాలకృష్ణం రాజు

నామినేషన్ దాఖలు చేస్తున్న పివిఎల్

చింతలపూడి : నియోజకవర్గంలో మంగళవారం రెండు నామినేషన్లు వేసినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి అద్దయ్య తెలిపారు. కాంగ్రెస్ నుంచి ఉన్నమట్ల ఎలిజా, ముప్పల ఎస్తేర్ రాణి ఇండిపెండెంట్‌గా నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

సిపిఐ ఏలూరు అభ్యర్థి వెంకటేశ్వరరావు నామినేషన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఇండియా వేదిక బలపర్చిన సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు ఏలూరు నియోజకవర్గ శాసనసభ స్థానానికి మంగళవారం పార్టీ ఆనందోత్సాహాలు, కోలాహలం మధ్య నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ముక్కంటికి అందజేశారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ర్యాలీని అక్కినేని వనజ పార్టీ జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కష్ణ చైతన్య, కోనసీమ అంబేద్కర్ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి అరటికట్ల రవి, కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, భారత్ బచావో నాయకులు, సిపిఐ, సిపిఎం, ప్రజా సంఘాల నేతలు మద్దతు తెలిపారు. నామినేషన్ అనంతరం బికెఎంయు గౌరవాధ్యక్షులు జల్లి విల్సన్ మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలపై పోరాడుతున్న బండి వెంకటేశ్వరరావుకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వనజ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి స్థానికంగా పరిచయాలు గల వెంకటేశ్వరరావును గెలిపించడం ద్వారా సమస్యలను పరిష్కరించకోగలుగుతామని తెలిపారు. సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో సిపిఐ తరపున ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన వీరమాచనేని విమలాదేవి, అత్తులూరి సర్వేశ్వరరావు వంటి ఉద్దండుల స్ఫూర్తితో ప్రజల పక్షాన నిలిచి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, బత్తుల వెంకటేశ్వరరావు, బాడిస రాము, మైసాక్షి వెంకటాచారి, కారం దారయ్య, సన్నేపల్లి సాయిబాబా, కంచర్ల గురవయ్య, జమ్మి శ్రీనివాసరావు, జెవి రమణరాజు, కొండేటి బేబి, రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు, కలిశెట్టి వెంకట్రావు, మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, ఎఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, మావూరి విజయ, ఎంఎస్ నాగరాజు, కాంగ్రెస్ నుంచి దండు బోయిన చంద్రశేఖర్, మూర్తి, సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ పాల్గొన్నారు.

సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు నామినేషన్ సందర్భంగా ఇండియా వేదిక నేతల ర్యాలీ

కాంగ్రెస్ చింతలపూడి అభ్యర్థి ఎలిజా నామినేషన్

ప్రజాశక్తి - చింతలపూడి

ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థిగా ఉన్నమట్ల ఎలిజా మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖలుకు పెద్దఎత్తున జనం తరలిరావడంతో చింతలపూడి జన సందోహంతో నిండిపోయింది. ఆయన స్వగృహం నుంచి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరి కాంగ్రెస్ కాంగ్రెస్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ నుండి సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి పాదయాత్ర చేశారు. పట్టణం మొత్తం ఎర్ర జెండాలతో కళకళలాడింది. అనంతరం ఆర్‌ఒ అద్దయ్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేసిన క్యార్యక్రమాలు గెలిపిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, చింతలపూడి నియోజకవర్గ ఎన్నికల సిపిఎం ఇన్‌ఛార్జి మానుకొండ జీవరత్నం, సిపిఐ జిల్లా నాయకులు వసంతరావు, జంగారెడ్డిగూడెం పట్టణ కార్యదర్శి పసల సూర్యారావు, ప్రభాకర్, సుబ్బారావు, సిపిఎం మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ, నేతలు పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న ఎలిజా

సిపిఎం ఆధ్వర్యాన మోటార్ సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - నిడమర్రు

మతతత్వ బిజెపిని, దాన్ని బలపరుస్తున్న పార్టీలను ఓడించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన నిడమర్రు, భువనపల్లిలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యాన మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పాతపాటి హరికుమార్‌రాజు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరు లావణ్యకు ఓట్లేసి గెలిపించాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తానని అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలను బిజెపి నిలువునా మోసగించిందన్నారు. బిజెపిని బలపర్చిన టిడిపి, జనసేనను, లోపాయికారిగా మద్దతిస్తున్న వైసిపిని ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన్, కానూరు రాజు, కంచ వరప్రసాద్, సోంబాబు, లావేటి చంద్రరావు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న సిపిఎం నేతలు

కాంగ్రెస్ ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

కాంగ్రెస్ ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా ఆచంటకు చెందిన నెక్కంటి వెంకట సత్యనారాయణ (సతీష్) కాంగ్రెస్ అధిష్టానం సోమవారం సాయంత్రం 38 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో ఆచంట నియోజకవర్గానికి చెందిన ఎంఎల్ఎ అభ్యర్థిగా నెక్కంటి వెంకట సత్యనారాయణ (సతీష్)కు చోటు దక్కింది. సతీష్ 1981లో కాంగ్రెస్‌లో చేరారు. 1983-1988 మధ్య యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా, 1990-1993 మధ్య ఆచంట వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్‌గా, 2003-2014 మధ్య పట్టణ అధ్యక్షుడిగా, 2014 - 2019 మధ్య మండల అధ్యక్షుడిగా, 2018-2019 మధ్యలో రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యునిగా పదవులు అలంకరించారు. 2019లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. మరలా ఆయన ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ తరపున నామినేషన్ వేయనున్నారు.

సిరా చుక్కకో లెక్కుంది..

పోలింగ్ కేంద్రంలో ఓటరు చేతి వేలికి సిరా చుక్క వేయడం సాధారణ వ్యవహారం కాదు. దానికో ప్రత్యేకత ఉంది. పోలింగ్ కేంద్రంలో మొదటి పోలింగ్ అధికారి ఓటరును గుర్తించాక రెండో పోలింగ్ అధికారి చెరిపేందుకు వీలుకాని సిరాకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు. ఆయన ఓటరు ఎడమచేతి వేలిపై సిరా మచ్చ ఉందో లేదో తొలుత పరిశీలిస్తారు. ఆ తరువాత చెరగని సిరాతో ఎడమచేతి చూపుడు వేలిపై గీత గీస్తారు. అది ఎలా పడితే అలా గీయడం కాకుండా ఎడమచేతి చూపుడు వేలి గోరు పైభాగం నుంచి మొదలుపెట్టి వేలి మొదటి జాయింట్ వరకూ గీత పెడతారు. సిరాతో గుర్తుపెట్టాక ఆరడానికి కొంత సమయం తీసుకుంటారు. ఎందుకంటే ఓటు వేసి బయటకు వెళ్లే సమయానికి సిరా ఆరిపోవాలి. సిరాతో గీత పెట్టాకనే ఓటరుతో రిజిస్టర్‌లో సంతకం చేయిస్తారు. ఈ సమయంలో సిరా ఆరిపోతుంది.

రూ.13.64 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి, మద్యం సీజ్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇఎస్ఎంఎస్ కింద చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ.13.64 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఇందులో రూ.203.20 లక్షల నగదు కాగా, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.136.15 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ /ఎన్ కోర్ ద్వారా అందిన అభ్యర్థనల్లో ఇంతవరకూ 2006 అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం

సువిధ ద్వారా 2045 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకూ 2006 అనుమతులు జారీ చేయగా మరో 39 పరిశీలనలో ఉన్నాయన్నారు. సి విజిల్ ద్వారా 399 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనకు వచ్చిన 106 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఎన్‌జి ఎస్‌పి పోర్టల్ ద్వారా 604 ఫిర్యాదులు స్వీకరించగా వాటిలో 603 పరిష్కరించినట్లు తెలిపారు. ఒకటి పరిశీలనలో ఉందన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున్న ప్రజలు నగదు గానీ ఇతర విలువైన వస్తువులు గానీ ప్రయాణ సమయంలో తీసుకెళ్తే సమయంలో అందుకు సంబంధించి సరైన ఆధార పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు.

జై భారత్ అభ్యర్థి శ్రీనివాసరెడ్డి నామినేషన్

ప్రజాశక్తి - ఆచంట

జై భారత్ పార్టీ తరుపున ఆచంట నియోజకవర్గం ఎంఎల్ఎ అభ్యర్థిగా పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన వెలగల శ్రీనివాసరెడ్డి మంగళవారం నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా సత్తి వెంకట సత్య నారాయణ, గంగిరెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

25న కొట్టు నామినేషన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైసిపి తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొట్టు సత్యనారాయణ ఈ నెల 25వ తేదీ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆ రోజు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ఆయన తన నామినేషన్ పత్రాలను తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించనున్నారు. నామినేషన్ కార్యక్రమం నిమిత్తం మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో విస్తృత సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామమూ, వార్డు నుంచీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. 25వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు కొట్టు తన నివాసం నుంచి పాదయాత్రగా బయలుదేరి ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో స్టేట్ ఆక్వా డెవలప్మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం నాయుడు, ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఎంపిపిలు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న రమాదేవి

'వైసిపి పాలనకు చరమగీతం పాడండి'

ఉండి: వైసిపి దుష్ట పరిపాలనకు చరమగీతం పాడాలని కనుమూరి రమాదేవి ఓటర్లను కోరారు. టిడిపి ఉండి నియోజకవర్గ అభ్యర్థి కనుమూరి రఘు రామ కృష్ణంరాజు విజయం కోసం ఆయన భార్య రమాదేవి టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ వైసిపి దుష్ట పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని, ఓటర్లందరూ టిడిపి అభ్యర్థి కనుమూరి రఘు రామకృష్ణంరాజుకు ఓటు వేసి భారీ విజయాన్ని అందించాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రఘు రామకృష్ణం రాజు ఎప్పటికప్పుడు వ్యతిరేకిస్తూ జైలుకు వెళ్లిన సంగతి వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల ఉల్లంఘనలపై నేరుగా ఫిర్యాదు చేయండి

పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై తనను నేరుగా కలిసి ఫిర్యాదు చేయొచ్చని ఏలూరు జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ చెప్పారు. ఎన్నికల సాధారణ పరిశీలకులుగా కృష్ణకాంత్ పాఠక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 10 ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ ఎన్నికల పరిశీలకులుగా, ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా బాధ్యతలు స్వీకరించానని, జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని రెవెన్యూ అతిథి గృహంలో బస చేశానని తెలిపారు. జిల్లాలో సాధారణ ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం తనను పరిశీలకులుగా నియమించిందన్నారు. ఓటర్లను రాజకీయ పార్టీలు ఎటువంటి ప్రలోభాలకు లోనుచేయకుండా, ప్రజలందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరిగినట్లు ప్రజలు ఎక్కడైనా గుర్తిస్తే, నేరుగా తనకు ఫిర్యాదు చేయదలచుకున్నవారు రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో స్వయంగా కలిసి సమాచారం అందించవచ్చన్నారు. ఉదయం 11 గంటలలోపు లేదా సాయంత్రం 5 గంటలు దాటిన తరువాత తనను కలిసి, ఫిర్యాదు చేయాలని తెలిపారు. లేదా తన ఫోన్ నెంబర్ 9154690388 కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆకివీడు: మండలంలో ఈ నెల 24వ తేదీ బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ బి.ప్రదీప్ తెలిపారు. ఉండిలో 220 కెవి సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా అక్కడి నుంచి విద్యుత్ సరఫరా అయ్యే ఆకివీడు, కాళ్ల, ఉండి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆకివీడు సబ్ స్టేషన్ పరిధిలోని చెరుకుమిల్లి, అయిభీమవరం, కుప్పనపూడి, అజ్జమూరు గ్రామాలతో పాటు ఆకివీడు పట్టణం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన తెలిపారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ అంతరాయం ఉంటుందన్నారు. చినకాపవరం సబ్ స్టేషన్ పరిధిలోని చినకాపవరం, పెదకాపవరం, అప్పారావుపేట పరిసరాలలో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగవచ్చని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేను చేసిన అభివృద్ధి చూసి గెలిపించండి

జనసేన అభ్యర్థి పులపర్తి అంజిబాబు

ప్రజాశక్తి - వీరవాసరం

గతంలో నేను చేసిన అభివృద్ధిని చూసి నాకు ఓటు వేయండంటూ జనసేన భీమవరం నియోజకవర్గ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం ఆయన మండలంలో ప్రచారం నిర్వహించారు. కమతాలపల్లి నుండి మత్స్యపురిపాలెం, దూసనపూడి, బాలేపల్లి, పెర్కిపాలెం, నందమూరుగరువు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నుంచి కూటమి అభ్యర్థిగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. ప్రజారంజకమైన సంక్షేమంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపడంలో ఎటువంటి

ప్రచారం చేస్తున్న అంజిబాబు

సందేహమూ లేదన్నారు. ఆయన వెంట ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, వైస్ ఎంపిపి అడ్డాల రాము, మాజీ సర్పంచి దాడి కాశీ, బిజెపి మండల అధ్యక్షుడు కోడి నరసింహం, జనసేన, టిడిపి, బిజెపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం తరలించేదెలా..!

(మొదటి పేజీ నుంచి)

నుంచి వెళ్లడానికి కుదరదు. ఇది పూర్తి కావడానికి రోజులకుపైనే గడిచిపోతుంది. దీంతో వెంటనే మరో ట్రిప్ ధాన్యం తరలించేందుకు వాహనాలకు కుదరడం లేదు. దీంతో ధాన్యం తోలకానికి వాహనాలను పెట్టేందుకు వాహన యాజమానులు ముందుకు రావడం లేదని గగ్గోలు పెడుతున్నారు. మిల్లర్లకు ఫోన్ చేస్తే ఆన్‌లైన్ వ్యవహారమంతా ప్రభుత్వం చేతుల్లో ఉంటుందని, తాము ఏమీ చేయలేమని చెబుతున్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదని అంతా లబోదిబోమంటున్నారు. ఈ విధంగా కొనసాగితే రబీ ధాన్యం తరలింపు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది. వాతావరణంలో ఎప్పుడు ఎటువంటి మార్పులు వస్తాయో తెలియదు. గతేడాది రబీలో అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పుడు సైతం రవాణాలో నెలకొన్న సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. ఈసారైనా అటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రభుత్వమే లారీలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఐదో రోజు 59 నామినేషన్లు

(మొదటి పేజీ నుంచి)

పోటీ పడి మరీ బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ర్యాలీలతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి జనం ఎండలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నామినేషన్లకు మరో రెండు రోజులు మాత్రమే గడువు మిగిలింది. ఈ నెల 25వ తేదీతో నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది.

వైసిపి ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ నామినేషన్

అంతరాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా

(మొదటి పేజీ నుంచి)

ఫలితాలు సాధించొచ్చన్నారు. అంతరాష్ట్ర సరిహద్దుల వెంబడి నగదు, మద్యంతోపాటు ఓటర్ల తరలింపునకు అడ్డుకట్ట వేసే విషయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో మరింత పటిష్టమైన నిఘా పెంచాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి మండలాలకు చెందిన ప్రజలకు సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చుట్టరికాలు ఎక్కువగా ఉంటాయని, ఈ దృష్ట్యా పోలింగ్‌కు 48 గంటల ముందుగా ప్రజల కదలికలను నియంత్రించాల్సిన అవసరం ఉందని అన్నారు. తనిఖీల్లో ఏ విధమైన సీజ్ జరిగినా అది రాష్ట్ర సరిహద్దు జిల్లాల అధికారుల మధ్య సమాచారం ఉండాలన్నారు. ఏ చెక్‌పోస్టు ద్వారా తరలింపు జరిగిందో అనే అంశాలపైనా దృష్టి సారించాలన్నారు. అటవీప్రాంతంలో అసాంఘిక వ్యక్తుల, నక్సలైట్ల కదలికలను నియంత్రించే భాగంలో ట్రాప్ కెమెరాలను అమర్చేందుకు అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా భారీ సంఘటనలు జరిగితే తక్షణమే స్పందించే నెట్ వర్కింగ్ అభివృద్ధి చేసుకోవాలన్నారు. ముఖ్యంగా సెబ్, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, పోలీస్, రిటర్నింగ్ అధికారుల మధ్య సమన్వయం అవసరమన్నారు. ఎస్‌పి డి.మేరీప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికలు కీలక దశకు చేరుకుంటున్న దృష్ట్యా వివిధ మార్గాల్లో నగదు, మద్యం, రవాణాకు వివిధ రూపాలను ఎంచుకునే అవకాశం ఉంటుందని, అటువంటి చర్యలను ఉక్కుపాదంతో నియంత్రించేందుకు పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. ఇప్పటికే అంతరాష్ట్ర సరిహద్దుల్లో ఎనిమిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, వాటిలో తాటియాకులగూడెం వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాపిడిగూడెం, యాగర్లగూడెం-రామన్నగూడెంల్లో మరో రెండు సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని కొత్తగూడెం ఎస్‌పిని కోరారు. ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగిన దృష్ట్యా మావోయిస్టుల కదలికలపై మరింత నిఘా ఉంచాలన్నారు. కచ్చారోడ్ల ద్వారా నగదు, మద్యం వంటివి తరలింపు జరగకుండా మొబైల్ చెక్‌పోస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోటారు సైకిళ్ల కదలికలపైనా నిఘా ఉంచాలన్నారు. మరీ ముఖ్యంగా పోలింగ్ రోజున రాష్ట్ర సరిహద్దుల్లోని జిల్లాల్లో ఓటర్లను తరలించే అవకాశాలు ఉన్నందున వాటిపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ డి.పుష్పమణి, సెబ్ జాయింట్ డైరెక్టర్ ఎన్.సూర్యచంద్రరావు, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీలక్ష్మి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరమేశ్వరన్, అధికారులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతమే కీలకం

(మొదటి పేజీ నుంచి)

అభ్యర్థుల గెలుపుతోపాటు వాడికి వచ్చే మెజారిటీపై ప్రభావం పడింది. ఏలూరు, భీమవరం, నరసాపురం మినహా మిగిలిన నియోజకవర్గాల్లో ఆశించిన మేర పోలింగ్ శాతం నమోదైంది. ఈ మూడు నియోజకవర్గాలతోపాటు జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లోనూ తక్కువ నమోదైన ఓటింగు శాతాన్ని పెంచేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. ఇప్పటికే వాల్‌పోస్టర్లు, హోర్డింగులు, కరపత్రాలు ద్వారా ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి ఓటరు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకునే దిశగా చైతన్యవంతులను చేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్ల శాతానికి మించి ప్రస్తుత ఎన్నికల్లో ఓట్ల శాతం నమోదుకు కృషి జరుగుతోంది. పట్టణ ప్రాంతాల్లో స్వీప్ కార్యక్రమాల నిర్వహణకు కసరత్తు జరుగుతుండగా, పల్లెల్లో ఆ ప్రభావం కాస్త తక్కువగా ఉంటోంది. ఇటువంటి ప్రాంతాలపై అధికారులు ప్రధాన దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోలింగు బూత్‌ల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ అధికారులు చొరవ తీసుకుని బిఎల్‌ఒలు, డిప్యూటీ తహశీల్దార్లు, స్వీప్ నోడల్ అధికారులు, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగు అధికారులు ఓటర్లను చైతన్యవంతులను చేసే కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం కనిపిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 2019 ఎన్నికల్లో పోలింగు శాతం

ఆచంట	82.07	ఉంగుటూరు	87.31
పాలకొల్లు	82.55	దెందులూరు	85.12
నరసాపురం	78.83	ఏలూరు	68.39
భీమవరం	78.84	పోలవరం	86.91
ఉండి	85.34	చింతలపూడి	84.59
తణుకు	81.19	కైకలూరు	88.04
తాడేపల్లిగూడెం	80.84	నూజివీడు	87.84

రూ.కోట్లతో నరసాపురం నియోజకవర్గ అభివృద్ధి

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

నరసాపురం నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని కోమటితిప్పలో ప్రజ ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని కోరారు.

వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా కార్యదర్శిగా మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు మాజీ సర్పంచి గంటా శ్రీనివాస్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గంటా శ్రీనివాస్ మాట్లాడుతూ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని తెలిపారు.

మాసూళ్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో రైతులు వరి క్షేత్రాల్లో మాసూళ్లు వేగవంతం చేయాలని పెనుమంట్ర వ్యవసాయ శాఖాధికారి ఎ.జ్యోషిలా కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండల పరిధి లోని 16 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పట ివరకు 203 మంది రైతుల నుంచి 2,873 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు.

పితానితో శెట్టిబలిజ యూత్ సభ్యులు

పితానికి శెట్టిబలిజ యూత్ సభ్యుల మద్దతు

ప్రజాశక్తి - ఆచంట

నియోజకవర్గ ప్రజలు టిడిపి గెలుపును ఖాయం చేశారని, భారీ మెజార్టీ సాధనే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. పితాని సత్యనారాయణను పెనుమంట్ర మండలంలోని మల్లిపూడికి చెందిన తూర్పు రామాలయం, పడమటి రామాలయం శెట్టిబలిజ యూత్ సభ్యులు 150 మంది జుత్తిగ శ్రీను, (దుబాయ్ శీను) ఆధ్వర్యంలో మంగళవారం కొమ్ముచిక్కాలలో మర్యాద పూర్వకంగా కలిసి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడారు. ప్రజాస్వా మ్య పరిరక్షణ కోసం తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలే టిడిపి అభ్యర్థుల గెలుపునకు నాంది అని అన్నారు.

సీతారాముల కళ్యాణ మహోత్సవం

భీమవరం రూరల్ :శ్రీరామనవమిని పురస్కరించుకుని భీమవరం 34వ వార్డులోని పద్మాలయ థియేటర్ సమీపంలో ఉన్న కోదండ రామాలయంలో పళ్ల ఏసుబాబు కుమార్తె శృతి, శివ ప్రకాష్ దంపతులచే సీతారాముల కళ్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పళ్ల సత్యానందం, సత్యవతమ్మ, తారకరామ, హేమలత, పళ్ల నాగరాజు, సత్యనారాయణ, జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు, వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నరసాపురం డిఎస్‌పి శ్రీనివాసరావు

ఆచంట :ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని నరసాపురం డిఎస్‌పి గంటి శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్‌పై మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో 56 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను ప్రకటించామని, 135 పోలింగ్ స్టేషన్‌లో లోపల బయట కూడా వెబ్ కాస్టింగ్, సిఆర్‌పిఎఫ్ అధికారులకు అభ్యర్థన పంపామని తెలిపారు. నియోజకవర్గంలో పోలింగ్ సజావుగా జరగటానికి అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో తణుకు విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

తణుకు రూరల్ : జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో తణుకు బాలుర ఉన్నత పాఠశాల బాలబాలికలు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మావతి తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అభినందన సభలో పద్మావతి మాట్లాడుతూ చదువుతో పాటు చిత్రకళలో తమ పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. చిత్రకళ ఉపాధ్యాయుడు వెంపటాపు మాట్లాడుతూ ఇటీవల నెల్లూరు, విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించారన్నారు. విజేతలను పలువురు అభినందించారు.

అందరికీ ఉన్నత విద్య అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - తణుకు రూరల్

అందరికీ ఉన్నత విద్యనందించడమే లక్ష్యమని విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. శ్రీ చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)ను భాస్కర్, కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ ఎస్.శోభారాణి సందర్శించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. కళాశాలలో బోధన, బోధనేతర కార్యక్రమాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలా భాస్కర్ మాట్లాడుతూ అందరూ ఎప్పటికప్పుడు మారుతున్న విద్యావసరాలకు అనుగుణంగా సాంకేతికను ఉపయోగించడం నేర్చుకోవాలన్నారు. వారితో పాటు కళాశాల వైస్ ప్రిన్సిపల్ సి హెచ్.ఏడుకొండలు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఆర్‌కె.ఫణిధర్, ఎ.మారుతీదేవిచౌదరి, ఆర్ఎస్ఎం భూపాల్, డాక్టర్ జి.విజయకుమార్ పాల్గొన్నారు.

వైసిపిని గెలిపించండి : కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకోడేరు



ప్రచారంలో కవురు, పివిఎల్

రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ కోరారు. కొండేపూడి నుంచి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు ఎన్నికల ప్రచారాన్ని కవురు శ్రీనివాస్ పాలకోడేరు ఎంపిపి సత్యనారాయణరాజుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. పివిఎల్‌ను ఎంఎల్ఎగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, సర్పంచుల ఛాంబర్ మండలాధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణమరాజు సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ కృష్ణా జిల్లా కేబినెట్ కార్యదర్శిగా రామారావు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ముత్యాల రామారావు లయన్స్ ఇంటర్నేషనల్ 316డి లయన్స్ కృష్ణా జిల్లా కేబినెట్ సెక్రటరీగా నియమితులయ్యారు. 2024-25 సంవత్సరానికి 316డి జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన గద్దె శేషగిరి తన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కృష్ణా జిల్లా కార్యవర్గంలో అతి ముఖ్యమైన స్థానానికి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ముత్యాల రామారావును ఎంపిక చేశారు. ఆయన ప్రస్తుతం పాలకొల్లు మానవత శాఖకు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. 30 ఏళ్ల క్రితం వ్యాపార నిమిత్తం విజయవాడ తరలివెళ్లిన రామారావు ఐదేళ్ల క్రితం పాలకొల్లు తిరిగి వచ్చారు. పాలకొల్లులో కూడా లయన్స్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న రామారావును తిరిగి కృష్ణా జిల్లాలో కార్యదర్శిగా నియమించారు.

కొండేపూడిలో వంతెన నిర్మాణానికి కృషి : రఘురామ

ప్రజాశక్తి - పాలకోడేరు



మాట్లాడుతున్న రఘురామకృష్ణంరాజు

కొండేపూడిలో జిఅండ్‌వి కెనాల్ పై వంతెన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి, నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణంరాజు హామీ ఇచ్చారు. సిట్టింగ్ ఎంఎ ల్ఎ మంతెన రామరాజు, జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజుతో కలిసి ఆయన మంగళవారం కొండేపూడి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అనేక సమస్యలను రఘురామకృష్ణం రాజు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా జిఅండ్‌వి కెనాల్‌పై వంతెన గ్రామస్తుల కోరిక మేరకు నిర్మిస్తానని, ఎంఎల్ఎ రామరాజు ద్వారానే పనులు చేపడతా నని చెప్పారు.మంతెన రామరాజు, జుత్తిగ నాగరాజు మాట్లాడారు. అనంతరం రామచంద్రాపురం, వేంద్ర గ్రామం వరకు రోడ్ షో నిర్వహించారు.

తోట సీతారామలక్ష్మికి పలువురి అభినందన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి పొలిట్ బ్యూరో రాష్ట్ర సభ్యురాలిగా నియమితులైన తోట సీతారామలక్ష్మిని ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఎంఎల్ఎ రామరాజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తోట సీతారామలక్ష్మి భీమవరం మున్సిపల్ చైర్ పర్సన్‌గా, సుదీర్ఘకాలం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలిగా, నరసాపురం పార్లమెంట్ అధ్యక్షురాలిగా, రాజ్యసభ సభ్యురాలిగా ఎటువంటి అవినీతికి తావులేకుండా సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించి శాలువతో సత్కరించారు.

నరసాపురం : తోట సీతారామలక్ష్మిని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమ గోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

పాలకొల్లు విద్యార్థులకు రాష్ట్ర ర్యాంకులు

ప్రజాశక్తి - పాలకొల్లు

సాకేత్

చరిత

పట్టణంలో ఆదిత్య విద్యార్థి టి.సాయిహసిణి 594 మార్కులు, చైతన్య విద్యార్థి ఎ.సాకేత్ 594, శశి విద్యార్థి పి.చరిత 593, సన్‌షైన్ విద్యార్థి ఎ.భవ్యశ్రీ 592 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు.

గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ

బివిఆర్ఎం మున్సిపల్ బాలికల హైస్కూల్ విద్యార్థినులు మంచి ప్రతిభ కనపర్చారు. పి.హర్షిత 585, కె.జాహ్నవి 584, పి.సౌజన్య 579 మార్కులతో మొదటి మూ డు స్థానాలు సాధించారు. వీరిని మున్సిపల్ ప్రత్యేకాధికారి శివనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్, అధికారులు అభినందించారు.

ఎంఆర్‌కె విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - వీరవాసరం

జోత్స్న

సాయిశ్రీజ్యోతి

కీర్తి

ఇటీవల విడుదలైన పది పరీక్షల ఫలితాల్లో వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు విద్యార్థులను ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులు తమ ప్రతిభకు కారణమైన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం 134 మంది పది పరీక్షలు రాయగా 107 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ తెలిపారు. 58 మంది ప్రథమ, 35 మంది ద్వితీయ, 14 మంది తృతీయ స్థానాలు సాధించారు. మద్దాల జోత్స్న 572 మార్కులతో మండల ద్వితీయ స్థానం సాధించింది. ఎనిమిది మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. గత కంటే మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల గ్రామస్తులు, విద్యార్థుల తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవిద్య విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పది ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీ విద్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ బి.లక్ష్మీభవాని తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన బి.ప్రియాంక 585, ఎన్.రోహిత్ 570 మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

25న లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సదస్సు

తణుకు రూరల్ :లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సదస్సు ఈ నెల 25వ తేదీర తణుకు పట్టణంలో స్త్రీ సమాజం రోడ్డు, విక్టరీ బజార్ ఎదురుగా ఉన్న సజ్జాపురం లయన్స్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో సంక్షోభంలో భారత్ - ఆర్థిక, రాజకీయ మూలాలు అంశంపై ప్రముఖ ఆర్థిక రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ ప్రధాన వక్తగా మాట్లాడతారని తెలిపారు. ఈ సదస్సుకు పట్టణంలోని న్యాయవాదులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాల ఉద్యోగులు, డాక్టర్లు, విద్యార్థులు, యువత, కార్మిక కర్షకులు, ప్రజా సంఘాల కార్యకర్తలు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

'పెన్షనర్ల జీవితాలతో వైసిపి చెలగాటం'

నరసాపురం :ప్రభుత్వ ఉద్యోగాలు చేసి ఉద్యోగ విరమణ పొందిన తర్వాత పెన్షన్ మీద ఆధారపడి బతుకుతున్న పెన్షనర్ల జీవితాలతో వైసిపి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాలంకి సుబ్బరాయన్ అన్నారు. నరసాపురంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిని గెలిపించాలన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి లావణ్య నామినేషన్‌కు ఇలా..; టిడిపి ఎంపీ అభ్యర్థి నామినేషన్‌కు ఇలా..; వైసిపి ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ నామినేషన్‌కు మాత్రం ఇలా

'నామినేషన్ల'లో నిబంధనలు గాలికి..!

అధికారపక్షానికి ఒకలా.. ప్రతిపక్షాలకు మరోలా

అధికారులు, పోలీసుల తీరుపై విమర్శలు

వైసిపి ఎంపీ అభ్యర్థి నామినేషన్‌లో నిబంధనలకు తూట్లు

పోలింగ్ రోజు పరిస్థితి ఏమిటోనని సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నామినేషన్ల ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనలను అధికారులు గాలికొదిలేశారు. అధికారపక్షానికి ఒకలా.. ప్రతిపక్షానికి మరోలా అన్నట్లు పోలీసులు, రిటర్నింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మంగళవారం వైసిపి ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ నామినేషన్ సందర్భంగా అధికారులు నిబంధనలను పూర్తిగా పక్కకు పెట్టేశారు.దీంతో ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే పోలింగ్ రోజు పరిస్థితి ఎలా ఉంటుందోననే చర్చ సర్వత్రా నడుస్తోంది. ఈ నెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. నామినేషన్ వేసేది అధికార పక్ష అభ్యర్థి అయినా, ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి అయినా, స్వతంత్ర అభ్యర్థి అయినా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల పరిధిలోకి కేవలం అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే పంపించాలని ఎన్నికల నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ప్రతిపక్షాలకు, స్వతంత్ర అభ్యర్థులకు పక్కాగా నిబంధనలు వర్తింపజేస్తున్న పోలీసు అధికారులు అధికారపక్ష అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో మాత్రం నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. ఈ నెల 18న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అధికారపక్ష ఎంఎల్ఎ ఆళ్ల నాని నామినేషన్ వేస్తున్న సందర్భంలో వందల మంది అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లు దాటి కార్యాలయం గేటు వద్దకు చేరుకున్నా పట్టించుకునే నాథుడే లేకపోయాడు. 23వ తేదీ మంగళవారం వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ నామినేషన్ వేసిన సందర్భంలోనూ ఏలూరు కలెక్టరేట్ వద్ద అదే పరిస్థితి నెలకొంది. సోమవారం టిడిపి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ నామినేషన్ వేసిన సందర్భంలోనూ, శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి కావూరి లావణ్య నామినేషన్ వేసిన సందర్భంలోనూ నిబంధనల ప్రకారం అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే అధికారులు పంపించారు. కారుమూరి సునీల్‌కుమార్ నామినేషన్ సందర్భంలో మాత్రం నిబంధనలకు తూట్లు పొడిచారు. కలెక్టరేట్‌కు వంద మీటర్ల దూరంలో జెడ్‌పి గెస్ట్‌హౌస్ దగ్గర ఏర్పాటు చేసిన బారికేడ్ల దగ్గర నుంచి సుమారు 15 మందిని లోనికి పంపించారు. నిబంధనల ప్రకారం అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే పంపించాల్సి ఉండగా 15 మందిని ఎలా పంపించారనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. బారికేడ్ల వద్ద డిఎస్‌పి స్థాయి అధికారి ఉన్నప్పటికీ నిబంధనలు అమలు చేయకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కలెక్టరేట్ గేటు నుంచి లోపలికి సుమారు 12 మంది వెళ్లారు. ప్రభుత్వ ఆస్తులపై ఎటువంటి ప్రచారాలు ఉండకూడదని ఎన్నికల కమిషన్ కచ్చితంగా నిబంధనలు విధించినప్పటికీ మంగళవారం ఎంపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్లో ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం చుట్టూ, ఓవర్ బ్రిడ్జిపై వైసిపి జెండాలను కట్టారు. సోమవారం జరిగిన తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా అనధికార ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని ఆయనపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ స్వాధీన ప్రాంతాల్లో పార్టీ జెండాలు కట్టినందుకు కేసు నమోదు చేస్తారా లేదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా రిటర్నింగ్ అధికారి కార్యాయానికి వందమీటర్ల దూరంలో పెద్దఎత్తున బాణాసంచా పేల్చి హడావుడి చేసిన ఏఒక్క అధికారీ పట్టించుకున్న దాఖలాల్లేవు. ఎన్నికల నిబంధనలు పక్కగా అమలు చేయకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం లేకుండా పోతుందని సర్వత్రా చర్చ సాగుతోంది.

25న ఏలూరులో 'భారత్ నిజంగా వెలిగిపోతుందా?'పై సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, జనవిజ్ఞాన వేదిక, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, భారత్ బచావో, పౌరహక్కుల సంఘం, వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సంయుక్తంగా 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఏలూరులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సదస్సు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. సదస్సుకు సంబంధించిన విషయాలు నిర్వాహక సంఘాల తరఫున గుడిపాటి నరసింహారావు, ఎస్ఎన్.రమేష్, ఓరుగంటి శైలజ, ఎస్ఎన్.కట్టా, గుబ్బల నాగేశ్వరరావు, పి.గంగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. దేశాభివృద్ధి, ప్రజల సామరస్యం, సగటు మనిషి జీవనానికి సంబంధించిన విషయాలు చర్చనీయాంశంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ఈ సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు. ఏలూరు పరిసర ప్రాంతాల అభ్యుదయవాదులు, న్యాయవాదులు, ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, వివిధ సంఘాల, రంగాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో సదస్సుకు హాజరు కావాలని వారు కోరారు.

ట్రిపుల్ ఐటిలో ఆంగ్లభాష దినోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ట్రిపుల్ ఐటి కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ ఆంగ్లభాష దినోత్సవం మంగళవారం 'ఈ-క్రష్' పేరిట ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగ్లభాష అధ్యాపకురాలు కాత్యాయని విద్యార్థులతో కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించే దిశగా గ్రూప్ డిస్కషన్, డిబేట్, యూత్ పార్లమెంటేరియన్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిఒక్క విద్యార్థీ ఆంగ్లభాషపై పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిజెపికి మొడియం శ్రీనివాసరావు రాజీనామా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

నకిలీ ఎస్‌టి కొత్తపల్లి గీతకు అరకు ఎంపీ టిక్కెట్ ఇచ్చి, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థి గారపాటి సీతారామాంజనేయచౌదరికి టిక్కెట్ ఇవ్వకుండా ద్రోహం చేయడాన్ని నిరసిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు బిజెపి ఎస్‌టి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పోలవరం మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావు తెలిపారు. అరకు ఎంపీ టిక్కెట్ కొత్తపల్లి గీతకు ఇవ్వొద్దని అనేకసార్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షులకు విన్నవించామని, జాతీయ నాయకులకు లేఖల ద్వారా తెలియజేశామని చెప్పారు. కొత్తపల్లి గీత ఎస్‌టి కాదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఆమె అనేక ఆర్థిక నేరాలకు పాల్పడి అరెస్టయ్యి ప్రస్తుతం బెయిల్‌పై ఉందని, ఆమెకు టిక్కెట్ ఇవ్వడం తనకు తీవ్ర మనస్తాపం కల్గించిందని తెలిపారు. అందువల్ల తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలి: వ్యకాస

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఉపాధి హామీలో సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు అన్నారు. మండలంలోని ఉపాధి హామీ పనుల పరిశీలనలో భాగంగా జగ్గన్నపేటలో పని చేస్తున్న ఉపాధి కూలీలను సోమరాజు మంగళవారం కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఎండ తీవ్రతకు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ తరుణంలో సమ్మర్ అలవెన్స్ రద్దు చేయడం సరైన విధానం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అలవెన్స్ పునరుద్ధరించాలని డిమాడ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిలి.దానియేలు, కె.రామలక్ష్మి, దులపల్లి శుభ, పి.ఇందిర, మున్నే లీలావతి, జాలాది రాజేశ్వరి, పి.నరసమ్మ పాల్గొన్నారు

నినదిస్తున్న ఉపాధి కార్మికులు

25 నుంచి సమ్మర్ క్యాంప్

శ్రీ విద్యాలయ కరస్పాండెంట్ జి.సురేష్

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను కేంద్రంగా పని చేస్తున్న శ్రీ విద్యాలయ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఈ నెల 25వ తేదీ నుంచి నెల రోజులపాటు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ జి.సురేష్ తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, చేతిరాతను మెరుగుపరుచుకోవడం, యోగా, రిక్రియేషన్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి అడుగు లక్ష్యం దిశగా నిర్వహిస్తున్న శ్రీ విద్యాలయ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని కరస్పాండెంట్ సురేష్ తెలిపారు. దీనిలో భాగంగా పరీక్షలకు హాజరైన 54 మందిలో 53 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. పాఠశాలకు చెందిన సింగిరెడ్డి కావ్యశ్రీ 589 మార్కులు సాధించి మండలస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఇదే క్రమంలో పాఠశాలకు చెందిన వి.దుర్గాప్రసాద్ 586, కె.రాజేష్ 578 మార్కులు సాధించారని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో ఐఐటి ఫౌండేషన్ తరగతులు నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ తెలిపారు.



ఆకివీడులో శివ ప్రచారం

నాకు, వైసిపికి మధ్యే పోటీ

స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

ఉండి నియోజకవర్గంలో పోటీ తనకు, వైసిపికి మధ్యే ఉంటుందని టిడిపి రెబల్, ఉండి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు (శివ) అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం ఆకివీడు పట్టణంలోని మూడు, నాలుగు, ఐదు వార్డుల్లో మేళతాళాలతో మహిళలతో ఊరేగింపుగా ఇంటింటికీ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అధికార వైసిపికి తాను మాత్రమే పోటీ ఇవ్వగలనని, ప్రతిపక్ష టిడిపి మూడో స్థానంలో ఉంటుందని ఆయన అన్నారు. తన గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని శివ ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఆయన పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు.

అక్రమ మద్యం, నాటుసారాపై నిఘా పెంచాలి

సెబ్ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య

చింతలపూడి: సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అక్రమ మద్యం, నాటుసారా అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ (విజయవాడ) ఎం.శంకరయ్య ఆదేశించారు. చింతలపూడి పట్టణంలోని సెబ్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరించి విధులు నిర్వహించాలన్నారు. చింతలపూడి స్టేషన్ పరిధిలో ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా మరింత పెంచాలన్నారు. ఈ తనిఖీల్లో సెబ్ అధికారులు గణపతి బాబు, ప్రసాద్ లక్ష్మణరావు, మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు విచ్చేసిన ఎన్నికల పరిశీలకులు కృష్ణకాంత్

ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మే 13న నిర్వహించే ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఏలూరు జిల్లాకు నియమించిన సాధారణ ఎన్నికల పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ మంగళవారం ఏలూరు విచ్చేశారు. తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్, మీడియా కంట్రోల్ రూమ్‌ను ఆయన సందర్శించారు. మీడియా కంట్రోల్ రూమ్ నిర్వహణ తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాలో ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వచ్చే ప్రతికూల వార్తల నమోదు విధానం, వాటి పరిష్కార తీరును ఆరా తీశారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దానికి సంబంధించిన వివరాలపై మాట్లాడుతూ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలు, ఫిర్యాదులకు సంబంధించిన వివరాలు కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, సంబంధిత రిటర్నింగ్ అధికారులకు చేరవేస్తారని, ఆపై అవసరమైన చర్యలు తీసుకుంటారని వివరించారు. అనంతరం సోషల్ మీడియాలో వచ్చే అంశాలపై ఏ విధంగా వాటిని పరిష్కరిస్తున్నదీ సంబంధిత అధికారులు, సిబ్బందిని కృష్ణకాంత్ పాఠక్ అడిగి తెలుసుకున్నారు. సోషల్ మీడియాకు సంబంధించి ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్‌ల్లో వచ్చే రాజకీయపరమైన ప్రకటనలు, సంబంధిత అంశాలను పరిశీలించి వాటిని సంబంధిత రిటర్నింగ్ అధికారులకు పంపడం ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం సి-విజిల్ పర్యవేక్షక విభాగాన్ని సాధారణ ఎన్నికల పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ పరిశీలించారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు, ఫ్లయింగ్ సర్వేలెన్స్ టీములు క్షేత్రస్థాయిలో పరిశీలనకు సంబంధించి ఆయా వాహనాలకు అమర్చిన జిపిఎస్ విధానం ద్వారా ఆయా వాహనాలు ఎక్కడున్నది, ఆయా నిఘా బృందాల కదలికలను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణా తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఎన్నికల కమిషన్‌కు రోజూవారీ నివేదికలు పంపే విభాగాన్ని ఆయన సందర్శించారు. అనంతరం జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సాధారణ ఎన్నికల పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్‌కు వివరించారు. తొలుత జిల్లాలో స్వీప్ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కృష్ణకాంత్ పాఠక్ తిలకించారు. వీరి వెంట డిఆర్ఒ డి.పుష్పమణి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కృష్ణకాంత్